క్లుప్తంగా

విజయగణపతికి హారతులు



విజయగణపతి హారతిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. తొలుత అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి పాలతో అభిషేకాలు నిర్వహించారు.

విత్తన బంతులతో పచ్చదనం

ఎచ్చెర్ల, లావేరు మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ రకాల విత్తనాలతో విత్తన బంతులను జీవ శాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో పాఠశాల ఈకో క్లబ్ విద్యార్థులు తయారు చేశారు. వీటిని రోడ్డుకు ఇరువైపులా, చెరువుగట్లుపై వేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. అలా చేయడం వల్ల వర్షాలు పడినప్పుడు విత్తనాలు మొలకెత్తి పచ్చదనం పెంచి, భూతాపాన్ని తగ్గిస్తాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగులు సీట్లు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీలకు 12, ఎస్టీలకు ఒకటి మిగులు సీట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈనెల 11న లాటరీ ద్వారా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాల కోసం పాఠశాల పని వేళల్లో సంప్రదించాలన్నారు.

నేడు, రేపు తీరప్రాంత భద్రతపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల మండంలోని మత్స్యకార గ్రామాల్లో తీర ప్రాంత భద్రతపై బుధ, గురు వారాల్లో అవగాహన కల్పించనున్నట్లు ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎచ్చెర్ల స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పోలీసులు, మెరైన్ పోలీసులు సంయుక్తంగా డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో భద్రత, స్థానికులు వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై చిలకపాలెం సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. లావేరు గ్రామానికి చెందిన రౌతు జగదీష్ అనే వ్యక్తి బైక్‌పై శ్రీకాకుళం వైపు వస్తున్నాడు. వెనుక నుంచి కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. శ్రీకాకుళం రిమ్స్‌లో క్షతగాత్రుడుని చేర్పించారు. అక్కడి వైద్యులు ఉన్నత వైద్య పరీక్షల కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుడు ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఢీకొట్టిన వాహనం ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందుల తయారీలో నాణ్యత తప్పనిసరి



పరిశ్రమ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: పురుగు మందుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారుల బృందం స్పష్టం చేసింది. అరిణాంఅక్కివలసలోని నాగార్జున అగ్రికెం పరిశ్రమను వ్యవసాయ అధికారులు బృందం మంగళవారం పరిశీలించింది. తాడేపల్లిగూడేం వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్‌తో కడిన బృందం ఈ తనిఖీల్లో పాల్గొంది. పురుగు మందులు తయరీలో నాణ్యత, భద్రత, నిబంధనలు అమలు వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల పరిశీలన అధికారి మురళీధర్, మండల వ్యవసాయ అధకారి సురేష్ పాల్గొన్నారు.

రాధాకృష్ణులు అవతారంలో ..

జగన్నాథుడు దర్శనం



గుజరాతీపేటలో రాధాకృష్ణులు అవతారంలో జగన్నాథుడు



ఇల్లీసుపురంలో కూర్మావతారంలో స్వామివారు



మొండేటివీధిలో కూర్మావతారంలో..



పాండ్రంగివీధిలో శ్రీకృష్ణావతారంలో..

శ్రీకాకుళం కల్చరల్:

జగన్నాథస్వామి రథత్సోవంలో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఇందులో భాగంగా గుజరాతీపేటలోని జగన్నాథస్వామి దేవాలయంలోని స్వామివారిని రాధాకృష్ణులుగా మంగళవారం అర్చకులు అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్యామలరావు పర్యవేక్షించారు. అలాగే ఇల్లీసుపురం కూడలిలోని జగన్నాథస్వామిని కూర్మావతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథస్వామిని అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మీదర బాబాజీ, కమిటీ సభ్యులు పాలొన్నారు. పాండ్రరంగవీధిలోని శ్రీరామ మందిరంలో స్వామిని శ్రీకృష్ణావతారంలో ఉంచారు. మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జగన్నాథ ఉత్సవాల సందర్భంగా స్వామివారిని కూర్మావతారంలో అలంకరించారు. షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథకం కలిగి ఉండాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు సేవా దృక్పథకం ఉండాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల)లో అల్లూరి సీతారామరాజు జయంతి ముగింపు ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత డిప్యూటీ ఈవో కొత్తకోట అప్పారావులు మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ అంటే విద్యార్థుల కోసం పొరాటాలు చేయడం మాత్రమే కాదని, సమాజ సేవకు ఎంతో పాటుపడిన సంఘంగా కొనియాడారు. అత్యవసర సమాయల్లో ఎంతో మంది రక్తం అందక మరణిస్తున్నారని, ఇటువంటి కార్యక్రమాల వలన రక్తం కొరత తీరుతుందని పేర్కొన్నారు. రక్తదాతలకు ప్రశాంసా పత్రం, జ్ఞాపికలను అందచేసి అభినందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్‌లు మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉండే సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేయడమే కాకుండా సామాజిక సేవలు కూడా నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్ పాత్రో, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రవీంద్ర, ఐక్యూ కోఆర్డినేటర్ ఆర్.హరిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యన్నారాయణ, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ వై.పుల్ నాయుడు, ఎన్ఎస్ఎస్ సభ్యులు ఆర్.వెంకటేశ్వరరావు, సీహెచ్ చలమయ్య, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య, యు.రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, తిరుపతి రాజు, పవిత్ర, గోవర్దన్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణంలో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: బలగలోని గోవర్ధన్ సాయి ప్రకాశ్ స్టోర్సులో అగ్రికల్చర్, విజిలెన్స్ అధికారులు మంగళవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, పురుగులు మందులు, ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రికార్డులు, బిల్‌బుక్కులు, లైసెన్సు పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్టు గుర్తించారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, పి.మురళీక్రిష్ణ, జిల్లా నాణ్యత నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, మండల వ్యవసాయాధికారిణి ఎం.ఉషాకుమారి ఉన్నారు.

సంతవురిటిలో పారిశుద్ధ్య పనులు



కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువలను, వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయం సిబ్బంది పర్యవేక్షించారు.

డిప్లమో ఫలితాల్లో ఆదిత్య విద్యార్థికి ప్రథమ స్థానం



శ్యామ్‌సుందర్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి: ఇటీవల విడుదలైన పాలిటెక్నికల్ డిప్లమో ఫలితాల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బొడ్డేపు శ్యామ్‌సుందర్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్లలో 4,500 మార్కులకు గాను 4,305 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. సోంపేట మండలం కొండపోలేరు గ్రామానికి చెందిన శ్యామ్ సుందర్ నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందినప్పటికీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని, వారి శ్రమకు ఫలితంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లమో డీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు.

ఏపీఎంపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేసుపురం సీఎఫ్ ఎంపికలో స్థానిక ఏపీఎం సనపల ప్రసాదరావు కొంతమందితో కుమ్మక్కై తనకు అన్యాయం చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అయ్యప్ప స్వ యం శక్తి సంఘం అధ్యక్షురాలు పిలక గౌతమి కోరారు.

అమ్మవారి ఉత్సవాల్లో పేట్రేగిన యువకులు!



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఒకటో పట్టణ ఎస్ఐ కామేశ్వరరావు

- కళాకారులపై దాడి
- ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: అమ్మవారి ఉత్సవాల్లో కొందరు యువకులు పేట్రేగిపోయారు. మంగళవారం స్థానిక గుడివీధిలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న వేషధారులు, తప్పెటగుళ్ల కళాకారులపై కొంతమంది యువకులు విచక్షణారహితంగా దాడులకు ఎగబడ్డారు. బాధితులు, ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పదిన్నర గంటల సమయంలో ఘటాలతో పాటు తప్పెటగుళ్ల, కాళీమాత వేషధారణ వేసిన కొంతమంది తమ ఆటలతో ఉత్తేజపరుస్తూ ముందుకు సాగుతున్నారు. ఇంతలో ఆరుగురు యువకులు వారిపై ఒకేసారి దాడిచేశారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయగా ఎస్ఐ కామేశ్వరరావు ఘటనాస్థలికి చేరుకుని దాడియత్నానికి సంబంధించి వివరాలపై ఆరా తీశారు. తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.

హెల్మెట్‌ను విధిగా వినియోగించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సోంపేట: యువత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయవిజ్ఞాన సదస్సును మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనిల్‌తో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించక పోవడం వలన చాలా మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతున్నారన్నారు. ఎంవీఐ అనిల్ మాటాడుతూ.. హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు బి.కవిబాబు, బి.శ్రీరామమూర్తి, ఏవో వి.పాపారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానందుని బాటలో పయనిద్దాం



ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థులు

టెక్కలి:

విద్యార్థులంతా స్వామి వివేకానందుని బాటలో పయనించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గోపినాథపురం నుంచి పాత జాతీయ రహదారిలో గల వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరేంద్రచక్రవర్తి, విద్యార్థి సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కె.మురళి, శ్యామ్, మదన్‌మోహన్, విశ్వనాగ, అరవింద్, సంతోష్, గంగారాం ఉన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెడుస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నెల రోజులు కావస్తున్నా నేటికీ హామీల అమలు ఊసే లేదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా విచ్చేసిన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం చేప్పేది ఒకటి, చేసేది మరొకటని మొదటిలోనే తేలిపోయిందన్నారు. పేరుకే ఉచిత ఇసుక అని చెప్పడం తప్ప.. ఒక్కొక్క ఇసుక రీచ్‌లో ఒక్కోలా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. సగటున ఒక్కొక్క ట్రాక్టర్‌కు గత జగనన్న ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అమ్మకు వందనం, విద్యార్థులకు హాస్టల్ ఫీజ్‌లు, మహిళలకు మూడు సిలిండర్లు, రైతులకు రూ.20 వేలు ఇచ్చే ఊసే లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో లావేరు, జి. సిగడాం జెడ్పీటీసీలు మీసాల సీతంనాయుడు, కాయల రమణ, పార్టీ నాయకులు మీసాల వెంకటరమణ, దన్నాన రాజీనాయుడు, ముద్దాడ శంకర్, మీసాల శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, లుకలాపు శ్రీనివాసరావు, తోలేటి వెంకటరావు, మైలపల్లి కామరాజు, బెండు రామారావు, జరుగుళ్ల శంకరరావు, బొంతు సూర్యనారాయణ, ఆబోతుల జగన్నాథం, నక్క కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖపై అవగాహన అవసరం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎన్‌సీఎస్ డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీదేవి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు తపాలా శాఖపై అవగాహనతోపాటు పోస్టల్ స్టాంపులపై కనీస పరిజ్ఞానం కలిగి ఉండడం ఎంతో అవసరమని న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి అన్నారు. భారత తపాలా శాఖకు సంబంధించి క్విజ్ కాంపిటేషన్, వక్తృత్వ పోటీలను శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు న్యూ సెంట్రల్ స్కూల్ ఎల్లప్పుడు ముందుంటుందని, ఆదిశగా పలు విజ్ఞాన దాయకమైన కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ తరహా కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి, విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపుతామని శ్రీకాంత్ చెప్పారు. కార్యక్రమంలో తపాలా శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆవరణలో డ్రైడే కార్యక్రమం



పరిశుభ్రం చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళ, శుక్రవారాలలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధ కేంద్రం వద్ద పరిశుభ్రత పనులను మంగళవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో సిబ్బంది అంతా కలసి పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు నీరు నిల్వ ఉన్నచోట్ల క్లీన్ చేసి బ్లీచింగ్ వేశారు. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కనుగుల శ్రీనివాసరావు, ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణాకర రావు, సతీష్‌కుమార్, చిన్మయరావు ఉన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి ఆషాఢమాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తైలమర్దనం, సిందూరమర్దన, పసుపు, కుంకుమ, వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు

కవిటి: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించినట్టు రామారావు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నర్తు చామంతి ఉన్నారు.

130 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాశీబుగ్గ: పలాస సత్యసాయి సేవా సమితి మందిరంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించిన శిబిరంలో పలాస నేత్రవైద్యాధికారి రోణంకి వెంకటరమణ సమక్షంలో 130 మందికి వేద్య పరీక్షలు చేశారు. వీరిలో 70 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సేవా సంస్థ కన్వీనర్ డోకి జగదీశ్వరరావు, సేవాదల్ కో-ఆర్డినేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కృష్ణస్వామి, సునీత, ఉషారాణి ఉన్నారు.

కిడ్నీ రోగికి రూ. 40 వేల ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్:

కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రోగికి పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందజేసి పెద్ద మనస్సు చాటుకున్నారు యువకులు. వివరాల లోకి వెళితే.. మండలంలోని బూర్జపాడు గ్రామానికి చెందిన రత్నాల దీనా చౌదరి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. అసలే పేదరికంతో బాధపడుతున్న ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక రాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు చందాలు రూపేణా రూ. 40 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమె భర్త హరిశ్చంద్ర చౌదరికి మంగళవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.